క్లుప్తంగా

నాటువేసి నిరసన



నాటు వేసి నిరసన తెలుపుతున్న మహిళలు

నెల్లికుదురు: కనీసం ఇంట్లోకి వెళ్లడానికి కూడా వీలు లేకుండా బురదమయమైన రహదారిపై నాటు వేసి మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈసంఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గూడూరు/కేసముద్రం: 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం గొల్లకురుమ యాదవులు ఐకమత్యంగా ఉద్యమించాలని టీపీసీసీ వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్నయాదవ్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 5న జిల్లా కేంద్రంలోని యశోద గార్డెన్‌లో జరుగు యాదవ జిల్లా సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నర్సింహులపేట: భవన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భవన కార్మిక సంఘం మండల కమిటీ అధ్యక్షుడు ఎండి.ఉస్మాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11వ తేదీన మండల కేంద్రంలో జరిగే సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మోహన్, యాదగిరి, అశోక్, మల్లయ్య, మధు, ఉప్పలయ్య, సత్యం పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు



మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రం నుంచి ఈదులపూసపల్లి వెళ్లే రోడ్డు రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల తలపిస్తోంది. చుట్టు పక్కల ఉంటున్న నివాసులు, కాలనీ వాసులకు, అటువైపుగా వెళ్లే వాహనదారులకు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు, కల్వర్టులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తెగిన కట్టుకాల్వ



గూడూరు: మండలంలోని దస్రుతండా మీదుగా గూడూరు సమీప చెంద్రునిగూడెం శివారులోని చెంద్రుని చెరువుకు కట్టుకాల్వ ద్వారా వర్షపు నీరు రావడంతో కాల్వ తెగింది. చెరువులోకి వెళ్లాల్సిన నీరు వృథాగా పోతుంది. అధికారులు తొందరగా తెగిన కట్టుకాలువ పనులు చేపట్టాలని సమీప రైతులు కోరుతున్నారు.

రోబోటిక్స్ టెక్నాలజీపై అవగాహన ఉండాలి

తొర్రూరు: రోబోటిక్స్ టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాములు అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోహం అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రోబోటిక్స్ టెక్నాలజీపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు.

తండాల్లో సమస్యల తాండవం..!

- డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- వీధిలైట్లు లేకుండా విద్యుత్ స్తంభాలు
- దామ్యతండా జీపీ పరిధిలోని ప్రజల ఇక్కట్లు



పెద్దరామోజీతండాలో నిలిచిన మురుగు



బురదమయంగా జీపీ కార్యాలయానికి వెళ్లే దారి

మహబూబాబాద్ రూరల్: ప్రజలకు పరిపాలనను దగ్గర చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన తండా గ్రామపంచాయతీలు సమస్యలతో సతమతమవుతున్నాయి. మహబూబాబాద్ మండలంలోని దామ్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని తండాలు అని చెప్పవచ్చు. దామ్యతండా గ్రామపంచాయతీ పరిధిలో దామ్యతండాతోపాటు జేత్యతండా, తోకబోడుతండా, కోక్యతండా, పెద్ద రామోజీతండా, చిన్నరామోజీతండా ఉన్నాయి. మొత్తం ఆరుతండాల పరిధిలో 240 ఇళ్లు, 900పైచిలుకు మంది ఓటర్లు ఉన్నారు. ఆయాతండాల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు, చెత్తాచెదారం రోడ్లపై నిల్వ ఉంటూ ప్రజలు దోమల బెడదతో ఆసుపత్రుల పాలు కావల్సి వస్తోంది. తండాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి వీధిదీపాలు అమర్చకపోవడంతో అంధకారంగా మారి ఉంటున్నాయి. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, చిన్నపాటి వర్షానికే గ్రామపంచాయతీకి వెళ్లే దారి పూర్తిగా బురదమయం అయిపోతుందని స్థానికులు పేర్కొన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారుల పర్యవేక్షణలోపం వల్ల తాము అవస్థలు పడుతున్నామని ఆయా తండాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్యలతో సతమతమవుతున్న దామ్యతండా పరిధిలోని తండాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని ఆయా తండాల ప్రజలు కోరుతున్నారు.

మత్స్యకారుల సమస్యలపై మాట్లాడాలి



మాట్లాడుతున్న గొడుగు శ్రీనివాస్

నెహ్రూసెంటర్: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మత్స్యకారుల సమస్యలపై మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడాలని, మత్స్యకారులకు నష్టపరిహారం ఇప్పించకుండా, సీఎంతో మాట్లాడకుండా సమావేశాన్ని ఎందుకు నిర్వహించారో చెప్పాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంతో మాట్లాడే అవకాశాలు ఉన్నప్పటికీ మత్స్యకారుల కోసం ఏ మాత్రం పట్టింపు లేకుండా కాంట్రాక్టర్లకు మద్దతుగా సమావేశాన్ని ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. ముదిరాజ్‌లకు మేలు చేసే సమావేశాలు కావాలని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో కాట భాస్కర్, దుండి వెంకటేశ్వర్లు, మల్లం విజయ్‌కుమార్, పిడుగు వెంకన్న, వెంకన్న, ఈర్ల నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి



మహబూబాబాద్ రూరల్: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



కురవి: నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

సీపీఎస్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. సీపీఎస్ అనేది ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిటశాపంగా మారిందని, చనిపోయిన సీపీఎస్ ఉద్యోగులకు కనీసం ఆసరా పథకంలో వచ్చినంత పెన్షన్ కూడా రాకపోవడం విచారకరమన్నారు. సీపీఎస్ రద్దు కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన మహాధర్నాకు తరలివెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ రాద్ధాంతం



మహబూబాబాద్: నిరసన తెలుపుతున్న నాయకులు



పెద్దవంగర: ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మహబూబాబాద్: కాళేశ్వర ప్రాజెక్ట్ పీసీ ఘోష్ కమిషన్‌ను వెంటనే రద్దు చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై రాద్ధాంతం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు యాళ్ల మురళీధర్‌రెడ్డి, జెర్రిపోతుల వెంకన్న, తేళ్ల శ్రీనివాస్, రవి, రాజు, రాము, నీలేష్, శంకర్, మురళీ పాల్గొన్నారు.

దోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డులోని అమరవీరుల స్థూపం కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు తెలుగుతల్లి చిత్రపటానికి గోదావరి జలాలతో జలాభిషేకం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, నాయకులు పాల్గొన్నారు.

పెద్దవంగర: మోదీ, చంద్రబాబు కనుసన్నల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. కాళేశ్వరం కమిషన్ సీబీఐ విచారణకు అప్పగించడాన్ని ఖండిస్తూ సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో రామచంద్రయ్య శర్మ, సునీల్ రెడ్డి, దుంపల సమ్మయ్య, చింతల భాస్కర్, వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

పెద్దవంగర: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దుంపల ఉప్పలయ్య అధ్యక్షతన అవుతాపురం క్లస్టర్ పరిధిలో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో గోపాల్ నాయక్, శ్యామ్, రాజు యాదవ్, సీతారాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

మహబూబాబాద్ రూరల్: వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. గణేశ్ నిమజ్జన ప్రాంతాన్ని సీఐ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గణేష్ ప్రతిమలు నిమజ్జనం చేసే నిజాం చెరువు మత్తడి ప్రాంతం వద్ద జాగ్రత్తలు వహించాలన్నారు.

ముగ్గురు యువకుల బైండోవర్

మహబూబాబాద్ రూరల్: పలు కేసుల్లో అనుమానితులుగా ఉన్న ముగ్గురు యువకులను తహసీల్దార్ చంద్రరాజేశ్వర్ రావు ఎదుట బైండోవర్ చేశామని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి సోమవారం తెలిపారు. మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో కురవి మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన కొర్ని సతీష్, కేసముద్రం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మట్టి ఉదయ్ కిరణ్, పట్టణంలోని స్నేహనగర్ కాలనీకి చెందిన భూక్యా కృష్ణవంశీ పలు కేసుల్లో అనుమానితులుగా ఉన్నారన్నారు. వారిని తహసీల్దార్ ఎదుట రెండు లక్షల సొంత పూచికత్తుపై బైండోవర్ చేశామని, భవిష్యత్‌లో ఎలాంటి నేరాల్లో తలదూర్చకుండా ఉండాలని హెచ్చరించారు.

బీజేపీ నాయకులపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: పోలీసుల విధులకు ఆటంకపరచిన బీజేపీ నాయకులపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి సోమవారం తెలిపారు. కలెక్టరేట్ లో గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి సుమారు 70మంది బీజేపీ కార్యకర్తలు కలెక్టరేట్ లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారన్నారు. పోలీసుల మాట వినకుండా ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అందరూ ఒకేసారి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, దార ఇందుభారతి, చీకటి మహేష్ గౌడ్, గుగులోతు రాంబాబు, గుగులోతు మదన్, గడ్డం అశోక్, శ్యామ్ శర్మ, గాదె రాంబాబు, ఇతర కొంతమంది బీజేపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

గంగారం: మండలంలోని పూనుగొండ్ల గ్రామానికి చెందిన పెనక సుభద్రకు రూ.35వేలు మంజూరు కాగా సోమవారం మంత్రి ధనసరి సీతక్క ఆదేశాల మేరకు పెనక పురుషోత్తం చెక్కును పంపిణీ చేశారు.

ఆశవర్కర్ల అరెస్ట్ అప్రజాస్వామికం



మహబూబాబాద్ రూరల్: నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు

మహబూబాబాద్ రూరల్: ఆశవర్కర్ల అరెస్టు అప్రజాస్వామికమని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ పుచ్చకాయల రజని అన్నారు. టౌన్ పోలీసు స్టేషన్ వద్ద సోమవారం వారు మాట్లాడుతూ.. చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఏఐటీయూసీ పిలుపునివ్వకపోయినా ఆశవర్కర్లను అక్రమంగా అరెస్టు చేశారని విమర్శించారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆశవర్కర్లకు సమానపనికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రేణుక, నాగలక్ష్మి, విజయ, కోమలత, రాధ, మమత, మహేశ్వరి, యశోద, లక్ష్మి, సరిత, విజయ, కళ పాల్గొన్నారు.

ఆశవర్కర్ల ముందస్తు అరెస్టు

దంతాలపల్లి: ఆశవర్కర్లను సోమవారం ఉదయం ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై పిల్లల రాజు తెలిపారు.

గార్ల: ఆశవర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం గార్ల నెహ్రూసెంటర్‌లో ఆశవర్కర్లు రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోలో సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్, ఆశవర్కర్లు రమాదేవి, ఉమాదేవి, అరుణ పాల్గొన్నారు.

పొంగి ప్రవహిస్తున్న వాగులు



బయ్యారం: నీటిలోనుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సు



కొత్తగూడ: బారికేడ్లు ఏర్పాటు చేసిన ఎస్సై

బయ్యారం: మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాల సరిహద్దుల్లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పలు వాగులు ఉగ్రరూపం దాల్చాయి. వరంగల్–భద్రాచలం ప్రధాన రహదారిపై మండలంలోని జిన్నెలవర్రె వద్ద వరదనీరు పోటెత్తింది. భారీకేడ్లను పెట్టి వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

కొత్తగూడ: భారీ వర్షానికి కొత్తగూడ ఏజెన్సీలో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గుంజేడు వాగు, రాళ్లతెట్టె వాగులు ఉధృతంగా ప్రవహించడంతో సోమవారం ఎస్సై రాజ్‌కుమార్ బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాగుల ఉధృతిని తహసీల్దార్ రాజు పరిశీలించి స్థానికులకు సూచనలు చేశారు.

సంక్షిప్త సమాచారం

అమెరికా ఉత్పత్తులను బహిష్కరించాలి

దోర్నకల్: అమెరికా పెత్తందారి విధానానికి అడ్డుకట్ట వేసేందుకు దేశంలో అమెరికా ఉత్పత్తులను బహిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి దాసరి మల్లేశం కోరారు. అమెరికా ఉత్పత్తులను బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సైదేలు, సునీల్, సీతారాం పాల్గొన్నారు.

జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

దోర్నకల్: స్థానిక బుల్లెట్ ప్రూఫ్ వ్యాయామశాలలో సోమవారం నిర్వహించిన జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ సమావేశంలో జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా వర్కింగ్ అధ్యక్షుడిగా కె.దేవ్‌సింగ్, అధ్యక్షుడిగా ఎస్.సీతారాములు, ప్రధాన కార్యదర్శిగా బుట్టి అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా జి.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీలుగా కార్తీక్, వాసుదేవనాయుడు, కోశాధికారిగా మారబోయిన రాంభద్రం ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం



కురవి: కురవి శివారు లింగ్యాతండా గ్రామంలో ఇటీవల బాదావత్ రమేష్ అనే వ్యక్తి బావిలో పడి లేవలేని స్థితిలో ఉన్నాడు. వీరి పరిస్థితిని పరిశీలించిన హెల్ప్ సొసైటీ వ్యవస్థాపకుడు రఘు దాతల నుంచి సేకరించిన రూ.25వేలను కూతురు నిఖిత పేరు మీద ఫిక్స్‌డ్ చేసిన పత్రాన్ని కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో బాదావత్ రూపు, జగిత్యా, బానోత్ కిషన్, బానోత్ దస్రూ, బాదావత్‌రవి, హెచ్ఎం ఎల్లయ్య పాల్గొన్నారు.

నేత్రదానం చేయాలి

మహబూబాబాద్: నేత్రదానంతో మరో జీవిత కాలం ప్రపంచాన్ని చూడవచ్చని నేత్ర అవయవ శరీర దాతల సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు పరికిపండ్ల అశోక్ అన్నారు. జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలను పురస్కరించుకుని సోమవారం లయన్స్ క్లబ్ భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నాలుగు సెంటర్లలో యూరియా పంపిణీ

బయ్యారం: మండలంలోని 29 గ్రామపంచాయతీల రైతులకు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు సెంటర్లలో యూరియా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి రాంజీ తెలిపారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు.

గుప్త నిధుల తవ్వకాలపై కేసు నమోదు

దోర్నకల్: మండలంలోని బూర్గుపాడు గ్రామ సమీపంలో మటంగుట్ట పై గుప్త నిధుల తవ్వకాలపై కేసు నమోదైంది. మఠంగుట్టపై గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. ఈఘటనపై డోర్నకల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాసిన్‌పాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీధర్ తెలిపాడు.

పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ



దంతాలపల్లి: మండలంలో ఓ లారీ పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. సూర్యాపేట నుంచి వరంగల్ వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ కుమ్మరికుంట్ల గ్రామ సమీపంలోని రాగానే పాలేరు వాగు దాటాకా అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

తొర్రూరు రూరల్: మండలంలోని మాటేడు ప్రభుత్వ స్కూల్‌లోని విద్యార్థులకు లయన్స్ సేవా తరుణి ఆధ్వర్యంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ నాగవాణి, మురళీకృష్ణ దంపతుల కుమారుడు రుశ్వంత్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం నోటు పుస్తకాలు, పెన్నులు, ప్లేట్స్, ఆశవర్కర్లు, గ్రామ పంచాయతీ మహిళా సిబ్బందికి చీరలను అందజేశారు.

అందుబాటులో యూరియా

పెద్దవంగర: రైతులకు 30మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి స్వామి నాయక్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

టీబీ రహిత రాష్ట్రం కోసం కృషి చేయాలి

దంతాలపల్లి: టీబీ రహిత రాష్ట్రం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మండల వైద్యాధికారి కవిత అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని వైద్యశాలలో ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

యూరియా కొరతపై విచారణ చేయాలి

బయ్యారం: మండలంలో ఈ ఏడాది సరఫరా అయిన యూరియా కొరతపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాలని ఆదివాసీ జేఏసీ మండల చైర్మన్ వర్స ప్రకాష్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు.

యూరియా పంపిణీ



నర్సింహులపేట: నర్సింహులపేటకు ఏట్టకేటలకు యూరియా లారీలో దిగుమతి చేస్తుండగానే సోమవారం సాయంత్రం పెద్ద ఎత్తున పీఏసీఎస్, మరో షాపు వద్దకు కూపన్లతో రైతులు రావడంతో పోలీస్ బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు.

యూరియా కొరత తీర్చాలి

తొర్రూరు: పంటల సాగుకు ఎంతో ఉపయోగపడే యూరియా కొరతను తీర్చాకుంటే ఆందోళన తప్పదని సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి హెచ్చరించారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరన్న, శ్రీరాం, పుల్లయ్య, షరీఫ్ పాల్గొన్నారు.

కామెర్ల వ్యాధితో విద్యార్థి మృతి

గార్ల: కామెర్ల వ్యాధితో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి మృతిచెందిన సంఘటన సోమవారం హనుమంతుడి గుడి బజారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్లలోని హనుమంతుడి గుడి బజారుకు చెందిన బండారి శంకర్ కుమారుడు బండారు వెంకటేష్(16) గత 20రోజులుగా కామెర్ల వ్యాధితో బాధపడుతుండగా, ఎన్ని ఆసుపత్రులు తిప్పినా జబ్బు నయం కాలేదు. వెంకటేష్ ఆరోగ్య పరిస్థితి బాగలేకపోవడంతో గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా వెల్లడించారు.

యూరియా కోసం రైతుల నిరసన



కురవి: జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు



మరిపెడలో ధర్నా చేస్తున్న రైతులు



గార్ల పీఏసీఎస్ కార్యాలయం ఎదుట..

కురవి: మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయానికి సోమవారం రైతులు వందలాది మంది చేరుకున్నారు. యూరియా రాలేదని తెలియడంతో రైతులందరు 365 జాతీయ రహదారి వైపు పయనమయ్యారు. పెట్రోల్‌బంక్ పక్కన జాతీయ రహదారిపై వందలాది మంది రైతులు బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గణపతిబొప్పా మోరియా.. యూరియా కావాలయ్యా.. అంటూ రైతులు నినదించారు. ఎస్సై సతీష్ జోక్యం చేసుకుని కూపన్లు ఉన్న వారందరికి యూరియా ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని కేంద్ర సహకార వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం ముందు రైతులు తెల్లవారు జాము 3గంటలకే వర్షాన్ని కూడా లెక్క చేయకుండా వచ్చి యూరియా బస్తాల కోసం పడిగాపులు గాస్తున్నారు. సోమవారం యూరియా బస్తాలు రాకపోవడంతో రైతులు వందలాదిగా రోడ్డెక్కారు. సీఐ రాజ్ కుమార్‌గౌడ్, ఎస్సై సతీష్‌లు ఎంత నచ్చ చెప్పినా రైతులు ధర్నానుంచి విరమించలేదు. చివరికి మరిపెడ ఏడీఏ విజయ్‌చంద్ర వచ్చి మంగళవారం ప్రతి రైతుకు రెండు బస్తాలు యూరియా ఇస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

గార్ల: గార్ల పీఏసీఎస్ కార్యాలయం ఎదుట యూరియా కోసం సోమవారం తెల్లవారుజాము నుంచే వందలాది మంది రైతులు క్యూ కట్టారు. మంగళవారం వస్తుందని మీ పంచాయతీల్లోని రైతు వేదికల వద్ద యూరియా అందిస్తామని చెప్పడంతో రైతులు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్ సంబురాలు



తొర్రూరు: సంబురాల్లో పాల్గొన్న నాయకులు

తొర్రూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం శాసన సభలో ఆమోదం పొందేవిధంగా కృషి చేసినందుకు స్వాగతిస్తూ మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో సోమవారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల కుమార్, సోమ రాజశేఖర్, వెంకటాచారి, నర్సయ్య పాల్గొన్నారు.

పెద్దవంగర: బీసీ వర్గాలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడం హర్షనీయమని మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. రిజర్వేషన్ అమలును హర్షిస్తూ సోమవారం మండలంలోని అవుతాపురం గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.